హాస్టల్, బోర్డింగ్ ఒకేచోట!

- ఏళ్లుగా పాత భవనంలోనే..
- ఇబ్బందుల్లో రాంజీగూడ విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

కెరమెరి: వసతిగృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని.. మీ పిల్లలను హాస్టళ్లలో చేర్పించాలని ప్రభుత్వం, అధికారులు చేస్తున్న ప్రచారం ఉత్తిదేనని ఇక్కడ పాఠశాలు చెబుతోంది. ఏళ్లుగా పాతబడిన భవనంలో పాఠశాల కొనసాగుతుండడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకునే వారు కరువయ్యారు. చదువులు, పెట్టెలు తదితర అన్ని ఒకేచోట ఉండడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఇదీ మండలంలోని గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల రాంజీగూడ దుస్థితి. 4 నుంచి 10వ తరగతి వరకు 96 మంది విద్యనభ్యసిస్తున్నారు. ముగ్గురు రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉండగా..8 మంది సీఆర్టీలు ఉన్నారు.

ఏళ్లుగా సమస్యల్లో విద్యార్థులు

విద్యాబోధనకు సరిపడా టీచింగ్ స్టాఫ్ ఉన్నప్పటికి చదువుకునేందుకు గదులు లేక ఇక్కట్లు తప్పడం లేదు. ఏడు తరగతులకు నాలుగే గదులు ఉండడంతో కొన్ని తరగతులను వరండాల్లో పాఠాలు బోధిస్తున్నారు. వాస్తవానికి హాస్టల్‌కు, తరగతుల బోధనకు వేర్వేరు గదులు ఉండాల్సి ఉంది. కాని అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఇది కాక ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉండే గదుల్లోనే బస చేస్తున్నారు. కంప్యూటర్లు, ఏఎన్ఎం చెకింగ్, ప్రొజెక్టర్, స్టాఫ్, హెడ్‌మాస్టర్ అన్ని ఒకే గదిలో ఉండడం గమనార్హం. గదుల్లో కిటికీలకు తలుపులు సరిగా లేవు.

పనిచేయని ఆర్వోప్లాంట్

గతకొన్నేళ్లుగా ఆర్వోప్లాంట్ పనిచేయక చేతిపంపు నీటినే తాగుతున్నారు. శుద్ధజలం అందిస్తున్నామని చెబుతున్నా అధికారులకు వీరి సమస్యలు పట్టడం లేదు. 96 మందికి రెండు మూత్రశాలలు, రెండు మరుగుదొడ్లు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో నిర్మించిన రెండు మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ఆ గ్రామం కుమురం భీం ప్రాజెక్టులో ముంపు గ్రామం కావడంతో అక్కడి గ్రామస్తులకు ధనోరా వద్ద నూతన పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినప్పటికి అక్కడ కూడా ఈ పాఠశాల భవనం నిర్మించలేదు. అధికారులు వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



రాంజీగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాల



తరగతి గదిల్లో పెట్టెలు, విద్యార్థులు ఒకే చోట



మరమ్మతుకు నోచుకోని ఆర్వో ప్లాంట్

గదులు లేక ఇబ్బందులు



వేరువేరు గదులు లేక అన్ని ఒకచోట భద్రపరుస్తున్నాం. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. పాత భవనం కావడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. ఆగస్టు నుంచి కాస్మొటిక్స్ రాలేదు. అధికారులు నూతన గదులు ఏర్పాటు చేయాలి. – కుమురం అరుణ్‌కుమార్, 10వ తరగతి, రాంజీగూడ

నివేదిక అందించాం



ప్రతినెల పాఠశాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించాం. ఇటీవల ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి మా పాఠశాలను సందర్శించారు. ధనోరా వద్ద పునరావాస కేంద్రంలో నూతన భవనాల మంజూరుకు హామీఇచ్చారు. – లింబారావు, ప్రధానోపాధ్యాయుడు, రాంజీగూడ

ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరిస్తాం

ఆదిలాబాద్: మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి నవీన్, రత్నజాడే ప్రజ్ఞ కుమార్, పండ్ల శ్రీను పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

బీఆర్ఎస్‌లో చేరిక

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం ఎమ్మెల్యే జోగు రామన్న కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తుందన్నారు. లక్షలాది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలను కల్పిస్తుందన్నారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, బీసీ విభాగం పట్టణ అధ్యక్షుడు దాసరి రమేష్, జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, స్వరూప, మమత, ప్రహ్లాద్, భూమన్న, సంజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేద్కర్ జయంతి విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: అంబేద్కర్ మహిళ మండల్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న రమాబాయి నిర్వహించే రమాబాయి అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న పిలుపునిచ్చారు. ఆదివారం రమాబాయి మహిళ నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల బుద్ధవిహార్‌లో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అధ్యక్షుడు రత్నజాడే ప్రజ్ఞాకుమార్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తాంసి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం భీంపూర్ మండలంలో పలు అభివృద్ధి పనులను డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి కలిసి ప్రారంభించారు. వడూర్ బైరవ గుట్ట ప్రహరీ నిర్మాణం రూ.30 లక్షలు, కరంజి (టి)లో రూ.20 లక్షలతో గోదాం నిర్మాణానికి, అలాగే సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. 17 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కోజ్జన్ గూడ, టెక్డిరాంపూర్ గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, వైస్ ఎంపీపీ లస్మన్న, రైతుబంధు మండల అధ్యక్షుడు అనిల్, ఆర్ఐ శారద, సర్పంచ్‌లు హనుమాన్ దాస్, నరేందర్, ప్రతాప్, గంగారాం, కిరణ్, రవూఫ్, రాజన్న, రమణ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బాపురావు

పంటల రక్షణకు పాట్లు

- పందులు, కోతులతో ధ్వంసం
- చేన్లలోనే రాత్రివేళ అన్నదాతలు

పెంచికల్‌పేట్: రైతులు శ్రమించి సాగు చేస్తున్న పంటలను అడవి పందులు, కోతుల దాడుల నుంచి కాపాడేందుకు నానాయాతన పడుతున్నారు. పగలు, రాత్రిసమయంలో అవి పంటలపై దాడులు చేస్తూ ధ్వంసం చేస్తున్నాయి. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని ఎల్లూర్, అగర్‌గూడ, గుండెపల్లి, కమ్మర్‌గాం, నందిగామ, జిల్లెడ, మురళీగూడ గ్రామాల్లో గతేడాది కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగుకు వరద పోటెత్తడంతో రైతులు సాగు చేసిన వరి, పత్తి పంటలు పూర్తిగా కొట్టుకుపోయాయి. యాసంగి సీజన్‌లో జొన్న, కంది, పెసర, శనగ, నువ్వులు సాగు చేశారు. ప్రస్తుతం పంట కాత దశలో ఉండటంతో దాడులు చేస్తూ రైతులకు నష్టాలను మిగుల్చుతున్నాయి.

పంటల రక్షణకు గస్తీ

పంటలను రక్షించుకోవడానికి చుట్టూ చీరలు కట్టడం, మంచెలు వేసుకుని నిరంతరం గస్తీ కాస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా కాలం గడుపుతున్నారు. విడతల వారీగా గస్తీ కాస్తున్నామని వాపోతున్నారు. పంటల రక్షణకు సోలార్‌తో ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవడానికి అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అగర్‌గూడ గ్రామంలో సాగు చేసిన జొన్నపంట

గస్తీ కాస్తున్నా



మూడెకరాల్లో జొన్న, పెసరు, బబ్బెర్ల పంటలు సాగు చేశా. పంట చేతికందే సమయంలో అడవి పందులు, కోతులు దాడులు చేస్తున్నాయి. పంటల రక్షణకు రాత్రిసమయంలో గస్తీ కాస్తున్నా. అటవీశాఖ అధికారులు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతులు ఇవ్వాలి. – బామండ్ల పోచయ్య, అగర్‌గూడ

మధుర స్మృతుల్లో..



- పూర్వ విద్యార్థుల కలయిక
- 25 ఏళ్ల అనంతరం సమ్మేళనం
- సెయింట్ జోసెఫ్ పాఠశాలలో సందడి

కౌటాల: ఎక్కడో పుట్టి..ఎక్కడో పెరిగి..ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టు నీడలో..వియ్ ఆల్ ద ఫన్..వియ్ ఆల్ ద జాయ్ అంటూ పూర్వ విద్యార్థులంతా తమ గురువులతో కలిసి గత స్మృతులను నెమరేసుకున్నారు. మండలంలోని విజయనగరం గ్రామంలోని సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 1997–98 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులంతా హాజరై ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. అనంతరం తమతో చదివి చనిపోయినవారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఫాదర్ మత్తయి, పూర్వ గురువులు ఫాదర్ జెమ్స్, ఎంఎల్ మారయ్య, ఇంద్ర, శ్రీనివాస్‌గౌడ్, సిస్టర్ అలీ, నరేందర్, రవీందర్, ఫాదర్ సీజో, టామ్, వేరొనిక పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



వృత్తిరీత్యా నేను మంచిర్యాలలో ఉంటా. ఏదైనా శుభకార్యాలు ఇతర కార్యక్రమాల్లో కేవలం కొద్ది మంది మిత్రులం మాత్రమే కలుసుకునేవాళ్లం. ఆత్మీయ సమ్మేళనం కోసం చిన్ననాటి మిత్రులందరి సమాచారాన్ని సేకరించి వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నాం. అందరు ఒకే చోట కలుసుకోవడం సంతోషంగా ఉంది. – మదాను జీవనా, హైదరాబాద్

గత స్మృతులు పంచుకున్నాం



25 ఏళ్ల క్రితం నాటి మిత్రులను కలుసుకోవడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం అమెరికాలో చర్చి ఫాదర్‌గా సేవ చేస్తున్నా. పదో తరగతి పూర్తయ్యాక స్నేహితులందరం విడిపోవటంతో కొంతమంది టచ్‌లో ఉండేవారు. కలుసుకుని గత స్మృతులను పంచుకున్నాం. – బెంజీమెన్, అమెరికా

25 ఏళ్ల అనంతరం



పదో తరగతి పూర్తికాగానే ఉన్నత చదువుల కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లడంతో చిన్ననాటి మిత్రులకు దూరమయ్యాం. తిరిగి ఆత్మీయ సమ్మేళనంతో కలుసుకోవడం ఆనందంగా ఉంది. 25 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకోవడం సంతోషానిచ్చింది. – జాడి రాధ, మంచిర్యాల

నేడు కల్యాణోత్సవం

జైనథ్: మండలంలోని కూర గ్రామంలోని వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పద్మావతి, అలివేలిమంగ సమేతుడైన స్వామి వారి కల్యాణోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని గ్రామస్తులు కోరారు.

'సమసమాజ స్థాపనే కమ్యూనిజం లక్ష్యం'

ఎదులాపురం: సమసమాజ స్థాపనే కమ్యూనిజం లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాలనీకి చెందిన రవి, శంకర్, కళావతి, భూమన్న, శ్రీనివాస్, రాజలింగు, సింధుబాయికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సభ్యత్వ రసీదులు అందించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ అధ్యక్షుడు ఎస్.అరుణ్ కుమార్, సీనియర్ నాయకులు మధుసూదన్, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామ దేవతలే గ్రామాలకు రక్ష

ఆదిలాబాద్: గ్రామ దేవతలే గ్రామాలకు రక్ష అని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగనంద సరస్వతి స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని వేములవాడ బద్ది పోచమ్మగా ప్రసిద్ధిగాంచిన కోలిపుర బద్ది పోచమ్మ ఆలయ క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు దశరథ్ పటేల్, బెల్లూరి అయ్యప్ప ఆలయ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సూర్యకాంత్, రవీందర్, గాజరి చంద్రశేఖర్, ప్రభాకర్ లింగం, రాచర్ల సంతోష్, రాకేష్ గుండావారు, రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురికి గాయాలు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి, లోకారి గ్రామాల మధ్యలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి లోకారి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈప్రమాదంలో జ్ఞానేశ్వర్‌కు తీవ్ర గాయాలు కాగా.. దేవ్‌బాయ్, దేవ్‌రావ్, హరిదాస్‌లకు స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

'ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్'

ఆదిలాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరిస్తూ బీఆర్ఎస్ నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని క్రాంతినగర్ కాలనీలో పలువురు బీజేపీలో చేరారు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పట్టణ అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులు విడుదల చేస్తే అభివృద్ధి చేసిన దాఖలాలు లేవన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆదినాథ్, వేణుగోపాల్, జోగు రవి, దినేష్ మటోలియా, లాలా మున్న, రాజేష్, శ్రీనివాస్, ధోని జ్యోతి, సునంద రెడ్డి, పద్మ, రేఖ, సుభాష్ పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాయల్ శంకర్

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

ఇంద్రవెల్లి: ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ నాయకుడు రాథోడ్ బన్సిలాల్ ఆరోపించారు. ఆదివారం మండల నాయకులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడా చూసిన సమస్యలే ఉన్నాయన్నారు. పోడుభూములకు హక్కుపత్రాలు ఇచ్చే విషయంలో జాప్యం ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం బీఆర్ఎస్ నాయకులు మానుకోవాలన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేదల సంక్షేమం కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. నాయకులు అశోక్, మిర్జా ఆరిఫ్‌బేగ్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

ఎదులాపురం: అద్దె ఇవ్వకపోగా ఇంటి యజమానిపై బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కి చెందిన మహదేవ చంద్రమోహన్ రావుకు ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఇల్లు ఉంది. ఆయన రూపేశ్ అనే వ్యక్తికి స్కూల్ కోసం అద్దెకు ఇచ్చాడు. కరోనా సమయం 2020లో రూపేశ్ స్కూల్ మూసేశాడు. అంతే కాకుండా తన ఫ్రెండ్ సంతోష్‌కి అద్దెకు ఇచ్చాడు. సదరు వ్యక్తి అద్దె ఇవ్వకపోగా, అద్దె అడిగితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో చంద్రమోహన్ టుటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



బోథ్: ఆలయం వద్ద మహిళల సందడి

ఉట్నూర్: మండల కేంద్రంలో మహిళలు ఆదివారం పోచమ్మకు బోనాలు సమర్పించారు. మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఇంటి వద్ద చలి బోనాలు పోసుకుని ఆలయానికి చేరుకున్నారు. అనంతరం పోచమ్మకు నైవేద్యాలు సమర్పించారు. పుష్యమాస అమవాస్య తర్వాత పోచమ్మకు బోనాలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం.

బోథ్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు ముత్యాల పోచమ్మకు బోనాలు సమర్పించారు.

బోథ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలి

బోథ్: బోథ్ నియోజకవర్గం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళవేణి శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని షాదీఖానాలో సీపీఐ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పత్తి రైతులకు రూ.15వేల గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం నియోజకవర్గ స్థాయి కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా భారతాల గోవర్ధన్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా దేవిదాస్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, నళినిరెడ్డి, దేవేందర్, భాస్కర్, కేశవ్, షేక్ షాకీర్, గోదావరి, దాసు, సురేష్ పాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని పాతెపల్లికి చెందిన సీహెచ్ మౌనికకు రూ.36 వేలు, బొంబాయిగూడకు చెందిన చంద్రశేఖర్‌కు రూ.60 వేల సీఎం సహాయ నిధి నుంచి ఆర్థికసాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కులను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్, నాయకులు వెంకటాచలం, తిరుపతి, శంకరయ్య, అశోక్, మహేష్, రామన్న, మల్లేశ్, సురేశ్, వెంకటేశ్, బాపురావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న సీఐ నాగరాజు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని దరిగాం గ్రామంలో ఆదివారం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. 7 క్వింటాళ్ల బియ్యం, 26 దుప్పట్లతోపాటు పండ్లను అందజేశారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ అడవి జంతువుల వేటకోసం అక్రమంగా విద్యుత్ వైర్లను అమర్చితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై సోనియా, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), కౌటాల, బెజ్జూర్, దహెగాం, చింతలమానేపల్లి, పెంచికల్‌పేట, కాగజ్‌నగర్ మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ రాజశేఖర్ తెలిపారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. 133 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన యంత్రాల ఏర్పాటు దృష్ట్యా సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై రమేశ్

ఆసిఫాబాద్‌రూరల్: వాహదారులు హెల్మెట్ పత్రాలు ఉంటేనే వాహనం నడపాలని ఎస్సై రమేష్ అన్నారు. ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ చేశఋారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. 15 వాహనాలకు రూ.3300 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

దహెగాం: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ ఆవరణ, పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట ఎస్సై సనత్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి అన్నదానం

కౌటాల: శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రతి సోమవారం వారసంత సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చంద్రశేఖర్, ప్రభాకర్ సంతోష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అన్నదానం కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

సిర్పూర్(టి): సిర్పూర్(టి) ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.రాజాగౌడ్, ఉపాధ్యక్షులుగా బాన సంతోష్, హరి, గౌరవ అధ్యక్షుడిగా నజీర్ అలీ, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ్, కోశాధికారులుగా తులసీదాస్, కృష్ణ, కార్యదర్శులుగా శ్రీకాంత, శ్రీధర్, ప్రచార కార్యదర్శిగా కబీర్, ముఖ్య సలహాదారులుగా పైడి సంతోష్, కమిటీ సభ్యులుగా రాజశేఖర్, సుమన్, హరికృష్ణ, డోంగ్రే రవీందర్ ఎన్నికయ్యారు.

'భూ కబ్జాలపై పట్టింపేది'

ఆసిఫాబాద్: జిల్లాలో ప్రజాప్రతినిధులు భూకబ్జాలు, సెటిల్మెంట్లకు పాల్పడుతున్న అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు దుర్గం దినకర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి భూ కబ్జాలు, ప్రజా ఆస్తులను కాపాడాలని కోరారు.